సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం ၊ 4 ၊ నవంబర్ ၊ 2024



హనుమా.. ఇక్కట్లు కనుమా!
కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో వసతుల కొరతతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. 8లో



నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక
కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు. జిల్లా స్థాయి అధికారులందరూ పాల్గొంటారన్నారు.

గరిష్టం/కనిష్టం
35.6°/21.0°

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఆంధ్రా క్రికెట్ జట్టులో చోటు



డి. చంద్రిక



బి. తేజస్విని

అనంతపురం: ఆంధ్రా అండర్–15 బాలికల క్రికెట్ జట్టులో ఉమ్మడి జిల్లాకు చెందిన డి.చంద్రిక, బి.తేజస్వినికి చోటు దక్కింది. 2024–25 సీజన్‌కు సంబంధించి అండర్–15 పోటీలు ఒడిశాలోని కటక్‌లో జరగనున్నాయి. ఇందులో ప్రాతినిథ్యం వహించనున్న ఆంధ్రప్రదేశ్ జట్టులో వీరు చోటు దక్కించుకున్నారు. కాగా, అంతర జిల్లా మ్యాచ్‌ల్లో కుడిచేతి లెగ్ స్పిన్నర్‌గా, కుడి చేతి మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌గా చంద్రిక సత్తా చాటారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన బి.తేజస్విని కుడిచేతి మీడియం పేస్ బౌలింగ్‌లో రాణించారు. కుడిచేతి మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌గా అసమాన ప్రతిభ చాటి ఏపీ జట్టులో తన స్థానాన్ని పదిల పరుచుకున్నారు.

పండగకొచ్చి.. జలసమాధి

- టెక్కీ విషాదాంతం



మహేష్ (ఫైల్)

పెనుకొండ: ఈత సరదా ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ప్రాణాలు బలిగొంది. వివరాలు... పెనుకొండ నగర పంచాయతీలోని కోనాపురం గ్రామానికి చెందిన మహేష్ (36) అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బెంగళూరులో స్థిరపడ్డారు. ఆయనకు భార్య ప్రవల్లిక, మూడేళ్ల వయసున్న కుమారుడు ఉన్నారు. దీపావళి సందర్భంగా కుటుంబ సభ్యులతో కలసి స్వగ్రామానికి వచ్చిన ఆయన... తన సోదరుడు రాజేష్, తల్లిదండ్రులు, వెంకటేష్, లక్ష్మీదేవమ్మ, భార్యాపిల్లలు, మరికొందరు సన్నిహితులతో కలసి కొత్తచెరువు మండలం బండ్లపల్లి పంచాయతీ కమ్మవారుపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం భోజనం ముగించుకుని రాజేష్, మరికొందరితో కలసి సరదాగా ఈత కొట్టేందుకు బండ్లపల్లి సమీపంలోని పుట్టపర్తి–పెనుకొండ రైల్వే అండర్ బ్రిడ్జి వద్దకెళ్లారు. అండర్ బ్రిడ్జిలో ఉన్న నీటిలో ఈత కొడుతూ వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు నిర్మించిన సొరంగం వద్దకు చేరుకున్న మహేష్ అక్కడ నీటి ఉధృతికి ఇరుక్కుపోయాడు. గమనించిన తమ్ముడు రాజేష్... మహేష్‌ను వెలికి తీసేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అక్కడున్న వారి కేకలు విన్న అటుగా వెళుతున్న ట్రాక్టర్ డ్రైవర్ వెంటనే స్పందించి సొరంగంలో చిక్కుకున్న మహేష్‌ను వెలికి తీశాడు. అప్పటికే ఆయన ఊపిరాడక మృతి చెందినట్లుగా నిర్ధారణ కావడంతో కోనాపురంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కొత్తచెరువు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రమోద్ డబుల్ సెంచరీ

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–16 క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. టీం–ఏ, టీం–బీ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో టీం–ఏ టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసి 266 పరుగులకు ఆలౌట్ అయింది. కేవీ ఓంకార్ 55 పరుగులు చేసి రాణించాడు. బి.మహిత్ 5 వికెట్లు తీశాడు. అలాగే టీం–సీ, టీం–డీ మధ్య జరిగిన మ్యాచ్‌లో టీం–డీ జట్టు తొలుత బ్యాటింగ్ చేసింది. పది వికెట్ల నష్టానికి 346 పరుగులు చేసింది. జట్టులో జి. దేవ్‌ప్రమోద్ 39 ఫోర్లతో 215 పరుగులు సాధించాడు.

సాగునీటి సమరానికి సై



జిల్లా పరిధిలో..
మధ్య తరహా ఇరిగేషన్ ప్రాజెక్టులు, చెరువులు 16
ప్రాజెక్టుల కింద ఆయకట్టు 25,093 ఎకరాలు
మైనర్ ఇరిగేషన్ కింద చెరువులు 216
ఆయకట్టు 32,990 ఎకరాలు
సాగునీటి సంఘాలు 232
ప్రాదేశిక నియోజకవర్గాలు 1,476
పీఏసీఎస్‌లు..3

- ఈ నెల 21 నుంచి 23 వరకు ఎన్నికలు
- 232 సాగునీటి సంఘాలకు ఎన్నికలు మరూ
- కూటమి మద్దతుదారులకు ఝలక్ ఇవ్వనున్న రైతులు

పెనుకొండ: సాగునీటి సంఘాల ఎన్నికల సమరం రసవత్తరంగా మారనుంది. జిల్లాలో చిన్నతరహా, మధ్య తరహా ప్రాజెక్టులు, చెరువుల కింద 232 సాగునీటి సంఘాల చైర్మన్లు, డైరెక్టర్ల స్థానాలకు ఈ నెల 21, 22, 23 తేదీల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలో టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఐదు నెలలైంది. ఎన్నికల మేనిఫెస్టోలో రైతులు పంటలు సాగు చేసుకోవడానికి 'అన్నదాతా సుఖీభవ' పథకం కింద ఏటా రూ.20వేల సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ ప్రారంభమైనా సాయం అందలేదు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో రైతు భరోసా పథకం కింద నిర్దేశిత సమయానికి రైతుల ఖాతాలో డబ్బు జమ అయ్యేది. గత పాలనకు, ప్రస్తుత పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గమనించిన రైతులు సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఓటు ద్వారా తమ నిర్ణయాన్ని తెలియజేయనున్నారు.

ఎన్నికలపై రోజూ సమీక్ష


సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఉన్నతాధికారులు, కిందిస్థాయి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తూ ఉన్నారు. ఎన్నికల నిర్వహణపై ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేస్తున్నారు. ఆయా చెరువులు, ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టు రైతుల వివరాలను, ప్రాదేశిక నియోజకవర్గాలు, ఆయకట్టు వివరాలు పూర్తిస్థాయిలో సిద్ధం చేశారు. ఎన్నిక సమయంలో గొడవలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేస్తున్నారు.

పోటాపోటీగానే ఎన్నికలు!

సాగునీటి సంఘాల ఎన్నికలు పోటాపోటీగా ఉండనున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఓడినా వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో బలం మెండుగానే ఉంది. సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. కూటమి పార్టీలకు దీటుగానే పోటీ ఇవ్వనుంది. దీంతో రాజకీయ పార్టీల మద్దతుతో రంగంలోకి దిగే అభ్యర్థుల మధ్య పోటీ తీవ్రస్థాయిలో ఉండనుంది. ఇప్పటికే అన్ని పార్టీల వారూ ఎన్నికల్లో ఎవరిని నిలిపితే బాగుంటుందో చర్చలు జరుపుతున్నారు.

- జిల్లా పరిధిలో మీడియం ఇరిగేషన్ కింద 16 చెరువులు, ప్రాజెక్టులు ఉన్నాయి. ఇందులో ముదిగుబ్బ, రామగిరి, కనగానపల్లి, రాప్తాడు, పరిగి, హిందూపురం మండలాల్లోని ప్రాజెక్టులు, రిజర్వాయర్లు ఉన్నాయి. పెనుకొండ, కదిరి, హిందూపురం, పుట్టపర్తి, మడకశిర, రాప్తాడు ధర్మవరం నియోజకవర్గాల పరిధిలో 216 మైనర్ చెరువులు ఉన్నాయి. వీటి కింద 58,083 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులు, ప్రాజెక్టుల్లో 90 శాతం మేర నీరు చేరాయి. వీటి పరిధిలోని సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి.

ఇటీవల వర్షాలకు మరువ పారుతున్న పరిగి చెరువు



ఎన్నికలు సజావుగా నిర్వహిస్తాం

సాగునీటి సంఘాల ఎన్నికలు సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటాం. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు నిర్దేశిత ప్రాంతాల్లో ఎన్నికలు నిర్వహిస్తాం. రైతుల అభిప్రాయం మేరకు సాగునీటి సంఘం అధ్యక్షులు, డైరెక్టర్ల ఎన్నికను ఖరారు చేస్తాం. పోలీసుల పర్యవేక్షణలోనే ఎన్నికలు జరుగుతాయి.

– రాధాకృష్ణ,
ఈఈ, మైనర్ ఇరిగేషన్, పెనుకొండ

ఖాకీ వనంలో కలుపు మొక్కలు

- నేరస్తులతో పోలీసుల సంబంధాలు
- పలు కేసుల నుంచి తప్పించే యత్నం
- ఉన్నతాధికారుల విచారణతో వెలుగులోకి..
- హిందూపురంలో ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్!
- అత్తా కోడలిపై గ్యాంగ్ రేప్ కేసులో మరో కీలక మలుపు



సాక్షి, పుట్టపర్తి: నేరస్తుల ఆట కట్టించాల్సిన పోలీసులు.. వారితోనే చేతులు కలిపినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. శాంతి భద్రతల్లో కీలకంగా వ్యవహరించే పోలీసు వ్యవస్థలో కలుపు మొక్కల్లా కొందరు వ్యవహరిస్తున్నట్లు తేలింది. విజయదశమి పండుగ రోజున రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన అత్తా కోడలిపై గ్యాంగ్ రేప్ కేసులో కీలక విషయం వెలుగు చూసింది. గ్యాంగ్ రేప్ కేసులో అరెస్టయిన వారితో కొందరు పోలీసులు సత్సంబంధాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వినిపించాయి. ఇందులో భాగంగా పోలీసు ఉన్నతాధికారుల విచారణలో వాస్తవాలు తేలినట్లు సమాచారం. ఈ క్రమంలో హిందూపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పని చేసే నరేశ్, వెంకటరామిరెడ్డి అనే ఇద్దరు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు పడినట్లు తెలిసింది. అయితే పోలీసు అధికారులు అధికారికంగా వెల్లడించలేదు. అంతకుముందు ఆ నేరస్తులతో టచ్‌లో ఉంటూ చాలా కేసుల నుంచి తప్పించే ప్రయత్నం చేయడంలో ఆ ఇద్దరి పోలీసుల పాత్ర కీలకమని తేలింది.

డబ్బుకు అలవాటు పడటంతోనే..

నేరాలు చేయడం.. అరెస్టు కావడం.. బెయిల్‌పై బయటికి రావడం.. ఎలాంటి కేసు అయినా భయం లేకుండా లోపలికి వెళ్లి బయటికి రావడం నేరస్తులకు అలవాటే. అయితే చాలామంది లాయర్ల ద్వారా బయటికి వచ్చే పరిస్థితి కనిపిస్తుంది. అందుకు భిన్నంగా హిందూపురంలో పని చేసే ఇద్దరు కానిస్టేబుళ్ల సాయంతో చాలామంది నేరస్తులు తప్పించుకున్నట్లు తెలుస్తోంది. నేరస్తులతో డబ్బులు దండుకోవడం.. పరారీ అయ్యేలా ప్లాన్ ఇవ్వడం ఆ ఇద్దరి పోలీసుల వంతుగా మారింది. దీంతో కొన్ని రోజులుగా సామాజిక మాధ్యమాల్లో పోలీసు వ్యవస్థపై సెటైర్లు వచ్చాయి.

ఉన్నతాధికారుల సీరియస్‌తో..

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన గ్యాంగ్ రేప్ కేసును పోలీసులు రెండు రోజుల వ్యవధిలోనే ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అయితే పట్టుబడ్డ నిందితులతో కొందరు పోలీసులు సన్నిహితంగా ఉన్నారనే వార్తలు వినిపించాయి. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. లోతైన విచారణ చేయడంతో వాస్తవంగా తేలింది. దీంతో నేరస్తులతో సంబంధం కొనసాగించిన వారిపై వేటు వేసినట్లు తెలిసింది.

కదిరిలో మరో కేసులో..

కదిరి సబ్ డివిజన్‌లో పని చేసే ఓ ఎస్‌ఐ, సీఐ టీడీపీ నేతలకు తలొగ్గి.. వైఎస్సార్‌సీపీ నేతపై అక్రమ కేసు బనాయించి రిమాండ్‌కు తరలించారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఒకట్రెండు రోజుల్లో ఆ ఇద్దరి పోలీసు అధికారులపై కూడా చర్యలు తీసుకునే అవకాశం లేకపోలేదు.

జిల్లా అభివృద్ధిపై నేడు సమీక్ష

ప్రశాంతి నిలయం: కలెక్టరేట్‌లోని జీపీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్య ప్రసాద్ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యేలు పాల్గొని జిల్లా అభివృద్ధిపై సమీక్షిస్తారని తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాయి ఆరామంలో ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులతో నిర్వహించే సమావేశంలో మంత్రి పాల్గొంటారు.

టీడీపీ నీచ రాజకీయం

- వ్యక్తిగత కారణాలతో యువకుడి ఆత్మహత్యాయత్నం
- వైఎస్సార్‌సీపీ నాయకులపై నెపం నెట్టే ప్రయత్నం

పుట్టపర్తి: టీడీపీ నాయకులు నీచ రాజకీయానికి తెరలేపారు. వ్యక్తిగత కారణాలతో యువకుడు ఆత్మహత్యాయత్నం చేసుకుంటే.. వైఎస్సార్‌సీపీ నేతలు ఇందుకు కారణమని బాధితుడి చేత చెప్పించే ప్రయత్నం చేశారు. గ్రామంలో తమకు ఎదురులేకుండా చేసుకునేందుకు ఏమాత్రమూ సంబంధం లేని విషయంలో వైఎస్సార్‌సీపీ నాయకులను ఇరికించేందుకు మూడు నెలల కిందట జరిగిన చిన్నపాటి గొడవను సాకుగా చూపి పన్నిన కుట్ర గురించి తెలుసుకున్న జనం టీడీపీ నాయకుల తీరును అసహ్యించుకుంటున్నారు. వివరాలిలా ఉన్నాయి. బుక్కపట్నం మండలం మారాల గ్రామంలో టీడీపీకి చెందిన మేకల నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామమోహన్, గోపి వర్గాల మధ్య మొహర్రం పండుగ వేళ ఇంటి వద్ద దారి విషయమై చిన్నపాటి గొడవ జరిగింది. ఆ తర్వాత ఎవరికి వారు మిన్నకుండిపోయారు. గ్రామంలో అందరితోనూ సఖ్యతగానే ఉంటూ వస్తున్నారు.

ఆత్మహత్యాయత్నాన్ని రాజకీయం చేసి...


మారాలకు చెందిన మేకల నారాయణస్వామి కుమారుడు గౌతమ్ పుట్టపర్తిలో ఉంటూ అప్పుడప్పుడూ స్వగ్రామానికి వచ్చి వెళ్తుండేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి గ్రామంలోని తమ ఇంట్లోనే శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి మంటలు ఆర్పి బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. అయితే ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదు. గౌతమ్ ఆత్మహత్యాయత్నానికి కారణం ప్రేమ వ్యవహారమని స్థానికులు చర్చించుకుంటున్నారు. అయితే గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులను అణచివేయాలన్న ఉద్దేశంతో గౌతమ్ ఆత్మహత్యాయత్నాన్ని టీడీపీ నాయకులు రాజకీయం చేసేందుకు కుట్ర పన్నారు. మూడు నెలల కిందట జరిగిన గొడవకు సంబంధించిన విషయంలో పోలీస్‌స్టేషన్‌కు వెళ్తుంటే భయభ్రాంతులకు గురిచేశారని, అందుకే తాను ఆత్మహత్యాయత్నం చేసుకున్నానని బాధితుడి చేత చెప్పించి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఖండించారు. రాజకీయ లబ్ధి కోసం గ్రామంలో కక్షలు రేపే చర్యలకు స్వస్తి పలకాలని వైఎస్సార్‌సీపీ నాయకులు రామమోహన్, గోపి తదితరులు టీడీపీ నాయకులకు హితవు పలికారు.

ఇది చేతగాని ప్రభుత్వం

- రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు
- వయోభేదం లేకుండా అఘాయిత్యాలు
- రోజుకో చోట వెలుగు చూస్తోన్న ఘటనలు
- నిందితులను కఠినంగా ఎందుకు శిక్షించరు?
- వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు ఉషశ్రీ చరణ్, దీపిక

సాక్షి, పుట్టపర్తి: 'రాష్ట్రంలో చేతగాని ప్రభుత్వం అధికారంలో ఉంది. మహిళలు సురక్షితంగా బయట తిరిగే పరిస్థితి కనిపించడం లేదు. మహిళలు, చిన్నారులు అనే వయోభేదం లేకుండా అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి. పోలీసు వ్యవస్థ ఏం చేస్తోందో అర్థం కావడం లేదు. నిందితులను కఠినంగా ఎందుకు శిక్షించరు? మహిళా రక్షణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలి. గతంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన 'దిశ' పోలీస్‌స్టేషన్లను కొనసాగించి ఉంటే ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉండేది' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్ దీపిక అన్నారు. ఈ మేరకు వారు ఆదివారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

శిక్షించాలంటే ఎందుకు భయం?



మహిళలు, చిన్నారులపై గ్యాంగ్ రేప్, అఘాయిత్యాలు, హత్యలు తరచూ వెలుగు చూస్తున్నాయి. నిందితులను ఎందుకు శిక్షించడం లేదు? అన్ని నేరాలకూ ఒకే శిక్ష వేస్తే మహిళలకు రక్షణ కష్టం. మహిళల జోలికి వచ్చిన వారిని కఠినంగా శిక్షించాలి. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడాలంటేనే భయం పుట్టేలా శిక్షలు పడాలి. అలాంటి చట్టాలను ప్రభుత్వం తీసుకురావాలి. నిందితులను పట్టుకుని అరెస్టు చూపేందుకు కూడా పోలీసులు ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తుండటం బాధాకరం. – టీఎస్ దీపిక

శాంతిభద్రతలు కరువు



రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయి. మహిళలకు రక్షణ లేకుండా పోయింది. పోలీసు వ్యవస్థ టీడీపీ నేతల చేతుల్లో కీలుబొమ్మలా మారినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. నేరం జరిగాక నిందితులను అదుపులోకి తీసుకుంటున్నారు. ముందుగానే ఎందుకు పసిగట్టలేకపోతున్నారు. ఒక ఘటనలో నిందితులను కఠినంగా శిక్షిస్తే నేరం చేసేందుకు మరొకరు భయపడతారనే విషయం పాలకులకు తెలీదా? ఇప్పటికైనా మహిళలకు రక్షణ కల్పించే విషయంలో సీఎం చంద్రబాబునాయుడు, హోం మంత్రి అనిత స్పందించాలి.

- పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త బాలాజీరెడ్డిని శనివారం అర్ధరాత్రి అక్రమంగా అరెస్ట్ చేయడం తగదు. మంత్రి సవిత అనుచరులు రొద్దం, నాగిరెడ్డిపల్లి, నారనాగేపల్లి, పెనుకొండ పరిసర ప్రాంతాల నుంచి ఇసుకను అక్రమంగా తవ్వి కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటుండటంపై సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించినందుకే టీడీపీ నాయకులు కక్షపూరితంగా కేసులు పెట్టారు. పోలీసులు ముందస్తు సమాచారం ఇస్తే స్టేషన్‌లోనే లొంగిపోయేవాడు. అలా కాకుండా అర్ధరాత్రి వేళ అదుపులోకి తీసుకుని భయభ్రాంతులకు గురి చేయడం తగదు. గతంలో టీడీపీ వారు వైఎస్సార్‌సీపీపై ఎన్ని పోస్టులు పెట్టినా ఏనాడూ కక్ష సాధింపులకు పోలేదు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి.

– ఉషశ్రీచరణ్

ప్రథమ వర్ధంతి



కీ॥శే॥ సానే ఆదినారాయణ రెడ్డి గారు

జననం : 06-01-1945
కనుముక్కల గ్రామం, చెన్నేకొత్తపల్లి మం॥, శ్రీ సత్యసాయి జిల్లా.
మరణం : 19-12-2023

06-11-2024 బుధవారం మధ్యాహ్నం 12 గం॥కు వీరి ప్రథమ వర్ధంతి శ్రీ సత్యసాయి జిల్లా, చెన్నేకొత్తపల్లి మం॥, కనుముక్కల గ్రామంలోని మా స్వగృహము నందు జరుపబడునని తెలియజేయడమైనది.

భార్య : సానే నారాయణమ్మ
కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు
సెల్ : 96529 94428

హనుమా.. ఇక్కట్లు కనుమా!


కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం


ఆలయ ముందు భాగంలో ఉన్న పార్కుల్లోని చెత్తకుప్పలు


అద్దె గదులు దొరక్క పార్కులోనే సేదతీరుతున్న భక్తులు

కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా ప్రసిద్ధి చెందిన నెట్టికంటి ఆంజనేయస్వామి కొలువు దీరిన కసాపురం దేవస్థానంలో భక్తులు అడుగడుగునా ఇబ్బందులకు గురవుతున్నారు. ఆలయంలో అద్దె గదుల కొరత తీవ్రంగా ఉండటంతో నానా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఓవైపు చలి, మరోవైపు దోమల బెడదతో రాత్రంతా జాగారం చేస్తున్నారు.

- నెట్టికంటుడి సన్నిధిలో భక్తుల పాట్లు
- వసతుల లేమితో అగచాట్లు
- చెత్త కుప్పలతో నిండిన ఆలయ పరిసరాలు
- అద్దె గదుల కొరతతో ఆరుబయటే భక్తుల నిద్ర

గుంతకల్లు రూరల్: ఏటా రూ.10 కోట్లకు పైగా ఆదాయం కలిగిన కసాపురం దేవస్థానంలో భక్తులకు కల్పించే సౌకర్యాలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. సాధారణ రోజుల్లో స్వామి వారిని దర్శించుకునే భక్తుల సంఖ్య వెయ్యి నుంచి 2 వేల వరకూ ఉంటుండగా, మంగళ, శనివారాల్లో మాత్రం 5 వేల మందికి పైగా భక్తులు తరలి వస్తారు. శ్రావణమాసం, కార్తీక మాసాల్లో ఈ సంఖ్య పది వేలకు పైమాటే.

గదులేవీ..?

భారీగా భక్తుల రద్దీ ఉన్న కసాపురం ఆలయంలో వసతి గదుల సదుపాయం మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. ఆలయంలో దాదాపు 105 వసతి గదులు ఉన్నాయన్నమాటే గానీ అందులో కనీసం సగం అద్దె గదులు అందుబాటులో లేవు. రూ.40 అద్దె వసూలు చేసే రామ సదనం, లక్ష్మణ సదనంలో 39 గదులు ఉండగా అందులో 7 గదులు మినహా మిగతా అన్నీ శిథిలావస్థకు చేరాయి. దీంతో వాటిని మూసివేశారు. రూ.500 అద్దె కలిగిన కేసరి సదనంలో 30 గదులు ఉండగా అందులో రెండింటిలో బ్యాంకును ఏర్పాటు చేశారు. మరో రెండు శిథిలావస్థకు చేరడంతో మూసివేశారు. 26 గదులను మాత్రమే భక్తులకు కేటాయిస్తున్నారు. గంగా నిలయం ప్రాంగణం, నూతనంగా నిర్మించిన రామదూత నిలయంలో మరో 36 అద్దె గదులు (ఏసీ, నాన్‌ఏసీ) ఉన్నప్పటికీ వాటి అద్దె రూ.1,000 నుంచి రూ.1,500 వరకూ ఉండటంతో సామాన్య భక్తులు అంత డబ్బు చెల్లించలేని పరిస్థితి. ఈ క్రమంలో కేసరి సదనంలోని 26 అద్దె గదులు ఏమాత్రం సరిపోక, ప్రత్యామ్నాయం లేక ఆలయ ప్రాంగణం, ఆలయ ప్రధాన గోపురం ముందు భాగంలో ఏర్పాటు చేసిన పార్కుల్లోనే రాత్రిపూట నిద్రిస్తున్నారు.

ఎటు చూసినా దుర్గంధం..

భక్తులు ఆలయ పరిసరాల్లో నిద్రిస్తున్నారన్న విషయం తెలిసినప్పటికీ ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడంపై అధికారులు దృష్టి సారించడం లేదు. పార్కులు చెత్త కుప్పలకు నిలయంగా మారి దుర్గంధం వెదజల్లుతున్నాయి. అయినా, గత్యంతరం లేని భక్తులు అక్కడే నిద్రిస్తున్నారు. దీనికి తోడు విపరీతమైన చలి, దోమల బెడదతో రాత్రంతా అల్లాడిపోతున్నారు.

అటకెక్కిన మాస్టర్ ప్లాన్..

భక్తులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మాస్టర్ ప్లాన్ అమలుకు అనుమతులు తీసుకువచ్చారు. పాలక మండలి సభ్యులతో కలిసి పలుమార్లు దేవదాయ శాఖ కమిషనర్, మంత్రులను కలిశారు. ఈ క్రమంలో మాస్టర్ ప్లాన్ అమలుకు శ్రీకారం చుడుతూ ఆ పనులను ద్రోణ కన్సల్టెన్సీకి దేవదాయ శాఖ కమిషనర్ అప్పగించారు. ఈ క్రమంలోనే సదరు కన్సల్టెన్సీ వారు రెండు పర్యాయాలు ఆలయానికి వచ్చి పరిశీలించారు. అంతా సవ్యంగా జరుగుతోందన్న తరుణంలో ప్రభుత్వం మారడంతో మాస్టర్‌ప్లాన్ అటకెక్కింది.

రాత్రంతా జాగారం..

ముగ్గురు చిన్న పిల్లలతో కలిసి ఏడుగురు కుటుంబ సభ్యులం వచ్చాం. శనివారం అయితే రూము దొరకదని శుక్రవారం రాత్రికే ఇక్కడికి వచ్చాము. రూము అడిగితే అద్దె గదులు ఖాళీ లేవన్నారు. ప్రైవేటు అద్దె గదులేమో రూ.1,500 చెబుతున్నారు. చలి ఎక్కువైంది, దానికి తోడు దోమలు కూడా పెరిగిపోయాయి. దీంతో పిల్లలను కాపాడుకోవడానికి రాత్రంతా జాగారం చేయాల్సి వచ్చింది.

– నాగేంద్ర, బత్తలపల్లి

గదులు ఖాళీ లేవంటున్నారు

ఆంజనేయస్వామి మా ఇంటి దేవుడు. కుటుంబమంతా కలిసి ప్రతి మూడు నెలలకోసారి వచ్చి స్వామిని దర్శించుకొని ఇక్కడే నిద్ర చేస్తాం. ఎప్పుడు వచ్చినా అద్దె గదులు ఖాళీగా లేవు అంటారు. గత్యంతరం లేక పార్కులోనో, ఆలయ పరిసరాల్లోనో పడుకోవాల్సి వస్తోంది. ఇంత పెద్ద దేవాలయంలో భక్తులకు అవసరమైన అద్దె గదులు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడాల్సివస్తోంది.

– ఆంజనేయులు, ధర్మవరం

పార్కుల నిండా చెత్తే

స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు అద్దె గదులు దొరక్క ఆలయ పరిసరాల్లోనే పడుకుంటారని ఆలయ అధికారులకు తెలుసు. అయినా పరిసరాలను ఇంత అధ్వానంగా ఎందుకు ఉంచుతున్నారో తెలియదు. పేరుకు పార్కే అయినా నిండా చెత్త నిండిపోయింది. పశువులు ఇష్టారాజ్యంగా తిరుగుతున్నాయి. ఆలయ పరిసరాల్లో సేకరించిన చెత్తను పార్కులో డంప్ చేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది.

– సుధాకర్, తులసాపురం

క్లుప్తంగా

పేకాట స్థావరాల్లో పోలీసుల తనిఖీలు

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా పేకాట స్థావరాలపై ఎస్పీ రత్న ఆదేశాల మేరకు పోలీసులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. ధర్మవరం టూటౌన్ పరిధిలోని తారకరామపురంలో సీఐ రెడ్డెప్ప ఆధ్వర్యంలో తనికీలు నిర్వహించి ఆరుగురిని అరెస్ట్ చేసి, రూ.14,150 నగదు స్వాధీనం చేసుకున్నారు. చిలమత్తూరు మండలం గొల్లపల్లిలో ఎస్ఐ మునీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో ముగ్గురు జూదరులు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.10,230 నగదు స్వాధీనం చేసుకున్నారు.

కర్ణాటకలో ప్రమాదం... పైపల్లి యువకుడి మృతి

పుట్టపర్తి అర్బన్: కర్ణాటకలో చోటు చేసుకున్న ప్రమాదంలో పుట్టపర్తి మండలం పైపల్లికి చెందిన అభిషేక్ (20) మృతి చెందాడు. బంధువులు తెలిపిన మేరకు... పైపల్లికి చెందిన బాల ఏటన్న కుటుంబం చాలా కాలంగా బెంగళూరులో స్థిరపడింది. ప్రతి నెలా స్వగ్రామానికి వచ్చి రేషన్, పెన్షన్ తీసుకుని తిరిగి బెంగళూరుకు వెళుతుండేవారు. ఈ క్రమంలో ఇటీవల కొత్తగా ద్విచక్ర వాహనం కొనుగోలు చేసిన అభిషేక్ పూజలు చేయించేందుకు తన అక్క కుమారుడు ఉదయ్‌తో కలిసి ఆదివారం స్వగ్రామానికి వస్తున్న సమయంలో చిక్కబల్లాపురం వద్ద రోడ్డు రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప కంచెను ఢీ కొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పైపల్లిలో అభిషేక్ అంత్యక్రియలు నిర్వహించారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఇద్దరి ఎంపిక


ఎంపికైన జశ్వంత్, చంద్రమౌళి

అనంతపురం: ఈ నెల 4 నుంచి 16వ తేదీ వరకు చెన్నై వేదికగా జరిగే హాకీ ఇండియా సీనియర్ మెన్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రాతినిథ్యం వహించే ఏపీ జట్టులో అనంతపురం జిల్లాకు చెందిన జశ్వంత్, చంద్రమౌళికి చోటు దక్కింది. ఈ మేరకు అనంతపురం జిల్లా అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎస్.అనిల్‌కుమార్ ఆదివారం వెల్లడించారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు 'అనంత' విద్యార్థులు

నెల్లూరు(టౌన్): జాతీయ స్థాయి యోగా పోటీలకు అనంతపురానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ – 14, 17 విభాగాల్లో నెల్లూరులోని దర్గామిట్టలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రారంభమైన 68వ రాష్ట్రస్థాయి యోగా చాంపియన్‌షిప్ –2024 పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీలను ట్రెడిషనల్, రిథమిక్, ఆర్టిస్టిక్ విభాగాల్లో నిర్వహించారు. వీటిల్లో పాయింట్లను ప్రామాణికంగా తీసుకుని బాలబాలికలను జాతీయ జట్టుకు ఎంపిక చేశారు. ఆర్టిస్టిక్, రిథమిక్ నుంచి ఒక్కొక్కరిని, ట్రెడిషనల్ నుంచి ఐదుగురిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అండర్ – 17 బాలుర ట్రెడిషనల్ విభాగంలో అనంతపురానికి చెందిన ఎం.అశోక్ కుమార్, సి.జ్యోతిమహేంద్ర ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు.


దెబ్బతిన్న కాజ్‌వేపై నడిచేందుకూ ఇబ్బందిపడుతున్న స్థానికులు

మంత్రికి పట్టని ప్రజల కష్టాలు

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లి వద్ద జయమంగళి నదిపై నిర్మించిన కాజ్‌వే దెబ్బతినింది. సిమెంట్ కాంక్రీట్ కాజ్‌వే కొట్టుకుపోవడంతో మట్టితో వంతెన వేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇది కాస్తా కొట్టుకుపోయింది. పైగా కాజ్‌వేపై భారీ గోతులు ఏర్పడ్డాయి. ఫలితంగా ద్విచక్ర వాహనాలు వంతెన దాటి అవతలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వివిధ గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇదే ప్రధాన మార్గం కావడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. దెబ్బతిన్న వంతెనను పునర్నిస్తామని ఎన్నికల సమయంలో ప్రస్తుత మంత్రి సవిత ఇచ్చిన హామీ నెరవేరకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరా పాహిమాం


-స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం మొదటి ఆదివారం కావడంతో పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరుడిని అర్చకులు బంగారు కవచంతో అలంకరించి ప్రత్యేక పంచామృతాభిషేకాలు, అర్చనలు గావించారు. ఆలయ ప్రాంగణంలో కుజదోష, కాల సర్పదోష, రాహుకేతు నివారణ పూజలతో పాటు స్వామి మూలమంత్ర బీజాక్షర హోమం చేపట్టారు. రథోత్సవం ఘనంగా నిర్వహించారు. మంజునాథ స్వామి, పార్వతి దేవి అమ్మవారికి కూడా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో నిమ్మదొప్పల్లో దీప కాంతులు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో భక్తుల సౌకర్యార్థం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

బంగారు ఆభరణాల చోరీ

రొళ్ల: మండలంలోని కొత్తపాళ్యం తండా సమీపంలో నివాసం ఉంటున్న మండల వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ తిమ్మప్ప ఇంట్లో చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వారం రోజుల క్రితం తిమ్మప్ప భార్య ఈరమ్మ బంధువుల ఇంటికి వెళ్లింది. గురువారం రాత్రి భోజనం ముగించుకున్న అనంతరం తిమ్మప్ప, కుటుంబసభ్యులు నిద్రకు ఉపక్రమించారు. అయితే సన్నిహితంగా ఉన్న ఓ వ్యక్తి ఇంటి వరండాలో పడుకున్నారు. శనివారం సాయంత్రం ఇంటికి వచ్చిన భార్య ఇంటి లోపల బీరువా తాళం తీసిన దృశ్యాన్ని చూసి భర్త తిమ్మప్పను ప్రశ్నించింది. అందులో నాలుగు తులాల బంగారు గొలుసుతో పాటు రెండు జతల కమ్మలు, యాంగీన్స్ మొత్తం కలిపి 6.5 తులాల బంగారు నగలు కనిపించడం లేదని తిమ్మప్ప దృష్టికి తీసుకొచ్చింది. అయితే ఇంటి వరండాలో నిద్రించిన సన్నిహితంగా ఉన్న వ్యక్తి ద్విచక్ర వాహనాల తాళాలు మాత్రం ఇంటి లోపల పడినట్లుగా తిమ్మప్ప గుర్తించారు. దీంతో సదరు వ్యక్తిపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనకు సంబంధించి పోలీసులకు తిమ్మప్ప ఫిర్యాదు చేశారు. చోరీ అయిన బంగారు నగల విలువ రూ.8 లక్షలని పేర్కొన్నారు.

17న కోటంకలో లక్ష దీపోత్సవం

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 17న లక్ష దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు రామాచార్యులు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తెల్లవారుజామున 4 గంటలకు రుద్రాభిషేకం, సాయంత్రం లక్ష దీపోత్సవం, రాత్రి 9 గంటలకు భజన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. భక్తులకు అన్నదానం ఉంటుందని తెలిపారు.

బైక్ దొంగ అరెస్ట్

కణేకల్లు: బైక్ చోరీ చేసిన కేసులో కణేకల్లు మండలం పూలచెర్ల గ్రామానికి చెందిన తలారి మారుతిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగమధు తెలిపారు. కణేకల్లు మెయిన్‌రోడ్డు పక్కన అక్టోబర్ 30న నిలిపిన బైక్ చోరీకి గురైందన్నారు. బాధితుడు సయ్యద్ ఖాద్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో తలారి మారుతిని శనివారం రాత్రి అరెస్ట్ చేసి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.


బత్తలపల్లిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు


నల్లబోయనపల్లిలో అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

బత్తలపల్లి: అందరి కళ్లలో చెప్పలేని ఆనందం... చిన్ననాటి మిత్రులను కలుసుకున్న వారి ఆనందానికి అవధుల్లేవు. కుటుంబ సమస్యలు, ఇతర ఇబ్బందులు అన్నీ మరిచిపోయారు. అప్యాయంగా పలుకరించుకున్నారు. ఆత్మీయంగా ఒకరి గురించి ఒకరు తెలుసుకుంటూ చిన్ననాటి అల్లర్లను గుర్తు చేసుకున్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1990–94లో పదో తరగతి చదువుకున్న 180 మందిలో 60 మంది ఒక్కటయ్యారు. దీపావళి సెలవులకు సుదూర ప్రాంతాల నుంచి కుటుంబసభ్యులతో స్వగ్రామాలకు వచ్చిన వీరందరూ ఆదివారం బత్తలపల్లిలోని గుండా కల్యాణ మంటపం కలుసుకున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎంతో ఆనందంగా గడిపారు. ఒకరి కష్టాలను మరొకరు పంచుకునేలా ప్రణాళికను రూపొందించుకున్నారు. ఈ అపూర్వ కలయికకు లక్ష్మానాయుడు, వెంకటచౌదరి (పిల్లల చౌదరి), అబు, నారాయణస్వామి, రమేష్, జనార్థన్‌నాయుడు, పెద్దిరెడ్డి, బీవీ చౌదరి, మోహన్‌రెడ్డి, సుబ్బు, మల్లికార్జున, బాలనరసింహారెడ్డి, కుమ్మర ఆదినారాయణ, మంగల రవిప్రసాద్, బ్యాంకు కాశీ, కొడవండ్లపల్లి రవి తదితరులు నేతృత్వం వహించారు.

నల్లబోయనపల్లిలో...

బత్తలపల్లి మండలం నల్లబోయనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–02లో పదో తరగతి చదువుకున్న వారు ఆదివారం ఆ పాఠశాల వేదికగా కలుసుకున్నారు. 22 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులను సన్మానించారు. అనంతరం తమతో పాటు చదువుకున్న స్నేహితురాలు అంజనాకుమారి కష్టాల్లో ఉందని తెలుసుకుని రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీకి పాల్పడుతున్న యువకుడి పట్టివేత

బత్తలపల్లి: ఆలయంలో చోరీకి పాల్పడుతున్న ఓ యువకుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాలు... బత్తలపల్లి మండలం మాల్యవంతం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయానికి ఆదివారం ఉదయం ధర్మవరం నివాసి నరసింహులు చేరుకున్నాడు. ఆలయంలో మూలవిరాట్‌ను సందర్శించుకుని మొక్కుకుని కాసేపు అక్కడే కూర్చొన్నాడు. అనంతరం భక్తులందరూ వెళ్లిపోయిన సమయంలో హుండీకి వేసిన తాళాన్ని మేకు సాయంతో తీసేందుకు ప్రయత్నిస్తుండగా గ్రామస్తులు అక్కడకు చేరుకుని యువకుడిని బంధించి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. గతంలో ఎక్కడైనా చోరీలకు పాల్పడి ఉంటాడనే అనుమానంతో యువకుడి వేలిముద్రల ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు.

చిల్లర కొట్టులోకి దూసుకెళ్లిన కారు


కిరాణా షెడ్డులోకి దూసుకెళ్లిన కారు

రాయదుర్గం టౌన్: స్థానిక కేటీఎస్ డిగ్రీ కళాశాల వద్ద వైఎస్సార్ సర్కిల్‌లో రోడ్డు పక్కన ఉన్న చిల్లర కొట్టులోకి ఓ కారు దూసుకెళ్లింది. ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు ఈ ఘటన చోటు చేసుకుంది. మద్యం మత్తులో ఉన్న ఆరుగురు యువకులు కారులో ప్రయాణిస్తూ ప్రమాదానికి కారణమైనట్లుగా కొట్టు యజమాని మాంతేష్ తెలిపారు. ప్రమాదంలో షెడ్డు మొత్తం దెబ్బతినడంతో దాదాపు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లినట్లు వాపోయాడు. కాగా, కారులో ఉన్న యువకులకూ స్వల్ప గాయాలయ్యాయి. పట్టణంలోని చిందనూరు కల్యాణ మంటపంలో జరిగిన ఓ వివాహ వేడుకకు అనంతపురం నుంచి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లుగా తెలుస్తోంది. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అట్టహాసంగా అంతర్ కళాశాలల క్రీడా పోటీలు


వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారిణులు

గుంతకల్లు: స్థానిక శంకరనంద గిరిస్వామి డిగ్రీ కళాశాలలో ఆదివారం శ్రీ కృష్ణదేవరాయ విశ్వ విద్యాలయం అంతర్ కళాశాల మహిళా క్రీడాపోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథులుగా ఎస్‌కే యూనివర్సిటీ రెక్టార్ జి.వెంకటనాయుడు, కళాశాల కరస్పాండెంట్ కేసీ హరి, ఎస్‌కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ జెస్సీ హాజరై ప్రారంభించారు. వక్తలు మాట్లాడుతూ మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు అందుకోవచ్చన్నారు. గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు గోపాల్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగి బ్యాంక్ ఖాతా నుంచి నగదు అపహరణ



ఫకృద్దీన్ ఖాతా నుంచి నగదు బదిలీ అయిన వివరాలు

హిందూపురం: స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న సయ్యద్ ఫకృద్దీన్ బ్యాంక్ ఖాతా నుంచి రూ.36,752 నగదు ఆయనకు తెలియకుండా ఇతరుల ఖాతాలోకి బదిలీ అయింది. ఈ నెల 1వ తేదీ నుంచి 2వ తేదీ తెల్లవారుజాము వరకు వరుసగా రూ.2 వేల నుంచి మొదలు రూ.5వేల వరకు విడతల వారీగా నగదు రింకుకుమార్ మీనా పేరుతో బదిలీ అయినట్లుగా నిర్ధారించుకున్న ఆయన శనివారం బ్యాంక్ అధికారులను కలసి వివరించారు. వారి సూచన మేరకు పుట్టపర్తిలోని సైబర్ నేర విభాగానికి అదే రోజు సాయంత్రం ఫిర్యాదు చేశారు. ఘటనపై సైబర్ నేర విభాగం దర్యాప్తు చేపట్టింది.

హర్యానా మద్యం సీజ్


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

అనంతపురం: నగరంలోని పాతూరు తాడిపత్రి బస్టాండ్ వద్ద ఆదివారం వైఎస్సార్ జిల్లా తొండూరు మండలానికి చెందిన వినయ్‌కుమార్‌రెడ్డి, గార్లదిన్నె మండలం కనంపల్లికి చెందిన రాజా మద్యం బాటిళ్లు తరలిస్తూ పట్టుబడ్డారు. వీరి నుంచి హర్యానా రాష్ట్రానికి చెందిన 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్యనారాయణ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

GNM (నర్సింగ్) అడ్మిషన్స్

ఇంటర్ ఎనీ గ్రూప్ పాస్ స్టూడెంట్స్ కి GNM నందు గవర్నమెంట్ సీట్స్ కలవు. ఫ్రీ ఎడ్యుకేషన్+ ఫ్రీ హాస్టల్ కలదు. సంప్ర : జి.మురళి, 9030661651, అనంతపురము. [A-1391]

REAL ESTATE

PLOT FOR SALE

అనంతపురం, SKU రోడ్, "శిల్పా లేపాక్షి వెంచర్" నందు మంచి వాస్తు, ఉత్తరం ఫేస్, 33x53 కొలతలు గల, 4 సెంట్లు ప్లాటు అమ్మకమునకు కలదు. సెల్: 9494422771. [A-762470]

LAND FOR SALE

వజ్రకరూరు మండలం పొట్టిపాడు గ్రామం సర్వే నెంబర్: 25 & 25-1A మెయిన్ రోడ్డుకు ఆనుకుని ప్రస్తుతం సాగులో ఉన్న 12.50 ఎకరాల భూమి మరియు గుంతకల్లు – బళ్ళారి N.H. హైవే రోడ్డు, కోల్డ్ స్టోరేజ్ గోడౌన్ కు ఎదురుగా ఉన్న 2 ఎకరాల భూమి అమ్మబడును. సంప్రదించండి. సెల్: 9901099666, 9182475322 . [A-1388]

SERVICES

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V-6593]

PRODUCT

Wall Berry Company యొక్క Block fix, Tile adasives 3 stages eco, Raw, Rich fix మరియు Water proofing, Heat proof materials whole sale rates కే లభించును. Mob: 9010114145. [A-3524]

WANTED

S.V. చికెన్ సెంటర్ (అనంతపురం) నందు పనిచేయుటకు (10th / Inter చదివిన) వర్కర్ కావలెను. సెల్ : 80744 29294, 95420 93517. [A-513]

అనంతపురం, గార్లదిన్నె బత్తాయి తోటలో పనిచేయుటకు ఫ్యామిలీ కావలెను. రూం + కరెంటు, భోజన వసతి కలదు. జీతం: 14000/-. సెల్ : 78010 11377. [A-1393]

పూజారి కావలెను. అనంతపురము పట్టణం, HLC కాలనీ దగ్గర కల గుడి నందు పూజారి కావలెను. సంప్రదించండి : సెల్ : 7981893089, 9396411169. [A-7075]

ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1253905]

అన్ని జిల్లాలలో కార్పొరేట్ బ్యాంక్ లందు పనిచేయుటకు Assistant Managers, BDM, Cashiers, Attenders కావలెను. జీతం:17,000–30,000, 88979 09097. [T-2367]

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K. Ph: 9640258899, 9640468899 [M-12648]

మా కంపెనీలో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ పురుషులు కావలెను. Qualification: కంప్యూటర్ నాలెడ్జ్, EXP. కలిగి, 40 సం॥లోపు ఏజ్ కలవారు మాత్రమే. జీతం: 8-9 వేలు. # కమలానగర్, ATP. 9493181828. [A-1392]

న్యూస్ ఛానెల్ నందు అనుభవం ఉన్నవారు పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మరియు అన్ని నియోజకవర్గాల వారీగా రిపోర్టర్స్, కెమెరామెన్, యాంకర్స్, యాడ్స్ మేనేజర్ కావలెను. A.P. ఇంచార్జ్, సెల్ : 9676842307. [A-1396]

Marketing trainees both male and female with MBA (Marketing) qualification for real estate business. Salary Rs. 10000/- per month + Fuel allowance. 06 Months probation period. CV to admin atp@mahathiinfradevelopers.com. Mahathi Realtors, Anantapur. Contact:9391756322, 7815906234. [A-511]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.